


# ఉన్నమాట

"అంబ పలుకు జగదంబా పలుకు
కంచిలోని కామాక్షీ పలుకు
మధురలోని మీనాక్షీ పలుకు
కాశీ విశాలాక్షీ పలుకు
ఉన్నమాట వున్నట్లే పలుకూ"

అంటూ ఒకనాటి వేకువజామున సుగుణవరం గ్రామంలోని నిశ్శబ్దతను చీల్చుకొంటూ ఒక బుడబుడక్కలవాడి కంచుగొంతుక, దానితో శ్రుతి గలుపుతూ అతని చేతిలోని డమరుక ఒక్కసారిగా మ్రోగాయి.

విశాల ఫాలభాగంలో తేటతెల్లని విభూతి రేఖల నడుమ చందనపు బొట్టుతో, ధనుస్సులా వంగిన ఒత్తైన కనుబొమలతో, ఒక్క చూపు తూపుతోనే మనిషిని భయ విహ్వాలుణ్ణి చేసివేయగలకన్నులతో, దృఢవదనమూ, ఆ దృఢవదనానికి నిండుదనాన్ని చేకూర్చే నల్లని గుబురుమీస

లతో, అన్నిటినీ మించి గింగురుమంటూ కర్ణపటలాన్ని ప్రకంపింపజేసే కంచు గొంతుకతో, నడకలో, నిలబడిన తీరులో, హావభావాల్లో ఈ భూతలవాసులకు తానతీతుడ ననిపింపజేసే ప్రత్యేకతతో గిలకను టకటక లాడిస్తూ, గ్రామవాసుల నిదురమత్తును చెదరగొడుతూ వీధులలో నడయాడుతున్న ఆ బుడబుడక్కల వాడిని చూస్తే— మారువేషంలో కైలాసగిరినుండి భూతలానికి దిగివచ్చిన పరమశివుడా ఈతడు?—అనిపింపక మానదు!

అతని పేరు జంగం నిజలింగభట్టు. వ్యవహారనామం నిజలింగప్ప. అతడు సుగుణావరానికి క్రొత్తవాడే. కాని, యిక్కడ కొత్త పాతల ప్రసక్తి వచ్చినప్పుడు చెప్పవలసిం దేమంటే—అతని చేతిగిలక గొంతుక విప్పిన నాటికి అతడు బుడబుడక్కల వేషంలో మాత్రమే ఆ ఊరికి క్రొత్తవాడు! అతడా ఊరిలో కాలు మోపి పదిరోజులైంది.

కానున్నది కమలభవుడెరుగునేమోగాని, నిజలింగప్ప జరిగినది జరిగినట్లు, ఉన్నది ఉన్నట్లు చెప్పగల ప్రజ్ఞాశాలి! "నే నన్నమాట పొల్లయితే రావణుని జంపినవాడు రాముడుకాడు; రామాయణం వ్రాసినవాడు వాల్మీకికాడు" అంటాడు నిజలింగప్ప. అయినా—యీనాటివరకూ "నువ్వ న్నది పొల్లు" అని ఏ ధీశాలి కూడా నిజలింగప్ప సవాలును ఖండించలేదు. అతని పలుకు లాలకించి ప్రతివారూ—

"ఆహా! నిజం!"

"ఔరా! సత్యం!"

"భళీ! వాస్తవం!" అంటూ పట్టరాని కుతూహలంతో స్తోత్రపాఠాలు చదివినవాళ్ళే!

చాలమంది "వీడు త్రికాలజ్ఞుడులా ఉన్నాడు" అనీ, "అంబను వశంచేసుకున్నట్టున్నాడు" అనీ అపోహపడి, ఆశ్చర్యంతో ముక్కున వేలువేసుకున్నారు కూడా. కానీ, అతడేమీ త్రికాలజ్ఞుడూ కాడు. అంబను వశంచేసుకోనూ లేదు, మరే మంత్రసిద్ధీ పొందలేదు. లోకులెరుగనిదీ, అతడుమాత్ర మెరిగినదీ ఒక్కటుంది. అతడొక క్రొత్త గ్రామంలో జోస్యం చెబుతున్నాడంటే-అతడా గ్రామంలో పదిరోజులనుంచీ అజ్ఞాతంగా ఉన్నాడన్నమాట! ఒక సామాన్యుడులా సుగుణవరానికి వచ్చిన నిజలింగప్ప పది రోజుల తరబడి గ్రామంలో ముఖ్యమైన మనుష్యు లెవరో, వారి గుణగణాలు, కుటుంబవిషయాలు ఏమిటో రహస్యంగా వాకబుచేసి తెలుసుకుని, పదకొండోరోజు — తలపాగా, అంగీ, గిలక, విభూతి రేఖలు. రెండువైపులా రెండుజతల జోలెలు మొదలైన హంగులతో బయలుదేరాడు.

...ఆ ఊరికి సుగుణవరమని పేరెవడుపెట్టాడోగాని అతగాడికి బహుశా తులసిమొక్కకు గంజాయి మొక్కకు భేదమేమిటో తెలిసిఉండదు. కాకపోతే సుగుణవర మేమి టీ?...అది దుర్గుణవంతులకు ఆలవాలమా!...శివశివ!... ఆ ఊళ్ళో ప్రముఖమైన దుస్స్వభావాలన్నీ ఎవరికున్నా యంటే—ఆ పురప్రముఖులకే!...వారిలో ఒకతను పైకి

చాలా సాధువు. నిజానికి—ఒక గొప్ప దొంగ! మరొకడు ప్రభుత్వాభిమాని; కాదు బాబో, అతడియింటి పెరట్లో సారాబట్టీ ఉంది! ఇంకొకడు భారత కథ ద్వారా ప్రజానీకానికి నీతిబోధ చేసే హరిదాసు; స్వీయజీవితంలో అతడు జూదంలో సాక్షాత్తూ ధర్మరాజు! మరొక వ్యక్తి శాంతి భద్రతల రక్షణార్థం, అవినీతి నిర్మూలనార్థం ప్రభుత్వం నియమించిన అధికారి. అయినంతమాత్రాన పాపమాతడు లంచాలకోసం జేబులు చూపుతున్నాడే కాని, చేతులేమైనా చాపుతున్నాడా?...

...వారి చరిత్రనంతా చెప్పమని నిజలింగప్ప ఆ వేకువ జామున అంబను వేడుకుంటున్నాడు...

"జరిగింది చెబుతాను—జరిగేది చెబుతాను
మనసులో దాగున్న మర్మాలు జెబుతాను..."

* * *

నిజలింగప్ప జీవితంలో నేటి వరకు తాను పట్టిందంతా బంగారమే! రొంపిచెర్లలో రంగధామ శ్రేష్ఠిగారు అపర దానకర్ణులు. పాకాలలో మునస్వామి ఆచారి పరమభక్తుడు. పులిచెర్ల రెడ్డిగారు పులివేటలో సిద్ధహస్తులు. పైన పేర్కొన్న వారు నిజలింగప్పకు తృణమో పణమో యిచ్చి సత్కరించిన ఉదారులు! కాని, ఆ ఔదార్యం నేడు సుగుణ వరంలో లోపించింది. నిజలింగప్ప శకునం విన్న ప్రతి గృహస్థూ అతడిపైన భగ్గున మండిపడ్డాడు. కొందరు నానా

తిట్లూ తిట్టారు. "భద్రం! ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడు! లేకపోతే ఎముకలు విరగదంతా" మన్నారు మరి కొందరు. అంతటిపని ఆ ప్రభుత్వాధికారి చెయ్యనే చేశాడు...! శివోహం!

గ్రామాంతరాలలో ఔదార్యం నిండి చిందిపోవడానికీ, ఇక్కడ సుగుణవరంలో అది లోపించడానికీ గల కారణం—మరేదో కాదు. నిజలింగప్ప నిజాయితీ! అతడు యథార్థ భాషి. ఉన్నమాట అనేయడం అతని ప్రధానాశయం!...

ప్రభుత్వోద్యోగి చేత చావు దెబ్బలు తినగానే అతడి గిలక మూగబోయింది. ఖంగుమనే అతని కంఠం తుస్సబోయింది. ఆ ఊరినంతా భగ్గున భస్మీపటలం చేసి వేద్దామన్నంత కోపం వచ్చింది. కాని, ప్రభుత్వాధికారి అంతటి వాడి ముందు ఆ కోపం బ్రహ్మాస్త్రం ముందు పిచ్చుకగంతు వంటిది.

నిజలింగప్ప ఒళ్ళు దులుపుకున్నాడు. తన జీవితంలో తారసిల్లిన విచిత్రాలలో యీ ఊరు ఒకటి! కాకుంటే—యిదేమిటీ ఈ పాడు వైఖరి? ఉన్నమాటంటే కొట్టడానికి వస్తారు మనుషులు! ఛీ! ఛీ! పాడు ఊరు! వెధవ ఊరు! పేరు సుగుణవరం! అందరూ దురహంకారులు!

తెల తెలవారబోతూంది. పశువుల కొట్టాల్లో లేగ దూడలు అంబా అంటుంటే, గూడుల్లో పిట్టలు రెక్కలు పటపట విదిలించుకుంటూ, కిచకిచమంటూ గొణుగుతున్నాయి. నిజలింగప్ప గొణుక్కుంటూ, సణుక్కుంటూ, వీధిలో నడిచి వెడుతున్నాడు. మరే యింటి ముంగిట నిలబడి శకునం పలకడానికీ అతడికి ధైర్యం చాలలేదు. "ఛీ ఛీ!...ఇదేం ఊరు? ఛండాలపు ఊరు!...కొట్టడానికి వస్తారు! ఉన్నమాటంటే ఈ ఊళ్లో విరోధం! ఛీ ఛీ! ఉన్న మాటంటే ఈ ఊళ్ళో విరోధం!..."

ఆ మసక వెలుతురులో ఒంటి నిండుకూ ముసుగు కప్పుకుని ఒక స్త్రీ ఆకారం ఆవలిస్తూ అతనికి ఎదురైంది. అతడు తనలో తాను సుస్పష్టంగా గొణుగుతున్నాడు... "ఛీ ఛీ! ఉన్న మాటంటే యీ ఊళ్ళో విరోధం! ఉన్న మాటంటే యీ ఊళ్లో విరోధం!..." ఆమె ఈ మాటలు విన్నది. ఒక పరదేశి తన స్వగ్రామాన్ని గూర్చి ఏదో అంటూంటే ఆమె కాళ్లు ఆగిపోయాయి. "ఏమయ్యా? ఏమో అంటున్నావు? పాపం, ఏదో జరిగినట్టుంది..." అన్నది సరళంగా. "ఏమిటో పోవమ్మా! అయినది చాలక నీతోనూ ఎందుకు నిష్ఠూరం? ఉన్నమాటంటే యీ ఊళ్లో విరోధం!..." అన్నాడు నిజలింగప్ప. పాపం, అతగాడికి ఏదో తీరని అన్యాయమే జరిగిపోయిందనుకుంది ఆమె. "అలా కాదు. నువ్వు చెప్పి తీరాలి. నీకు తెలియదు... నా

మనస్సు నవనీతం!'' అంటూ ఆమె అతనికి అభయ మిచ్చింది.

నిజలింగప్ప ఆమెకేసి పరీక్షగా చూశాడు. అతడు ఆమెకు తెలియకపోయినా, ఆమెను మాత్రం అతడెరుగును. ఆమె మనస్సు నవనీతమగునో కాదో నిజలింగప్పకు తెలియదుగాని ఆమెపేరు మాత్రం నవనీతమే!

ఆమెనుగురించి అతనికి ఒకటి రెండు వివరాలు తెలుసు! ఆమె జవ్వనానికీ, జగదేక సౌందర్యానికీ కన్నులే సాక్షులు. ఇక ఆమెను పెండ్లాడినవాడు—శరీరం ఉడిగి పోయినా, పసితనపు ఊహలుమాత్రం ఉడిగిపోని ఒక వృద్ధుడు! అయితేనేం—ఆమె ఓరిమికి అది గట్టి పరీక్ష. ఆమె భూదేవి (?).

...నిజలింగప్పకు యీ సమయంలో నాయుడుగారు జ్ఞాపకం వచ్చారు. నాయుడుగారు అప్పుడప్పుడూ, ఓట్ల కోసం అనకూడదుగానీ, ప్రజాసేవకోసం వేదికలెక్కు తుంటాడు. అతని అభిమానవిషయాలు రెండు. ఒకటి— వ్యభిచార నిర్మూలన! రెండు—అనాథరక్షణ! అతడు సాధారణంగా విమర్శలకు దొరకడు. అలా విమర్శించిన వాడు ధర్మసంకటంలో పడక తప్పదు.

నవనీతం! పాపం, అనాథ!

ఈ పేరు రెండోకంటికి తెలియకుండా, రెండో చెవికి వినబడకుండా, 'సుందరి'గా, 'మోహిని'గా, 'జవ్వ

ని'గా, 'ఓమైడాల్ ...'గా వివిధ రూపాలలో కణ్ణ పేయంగా పరిణమించే సున్నితమైన యంత్రాంగం ఏదంటే—నాయుడు గారి నోరు!

నాయుడుగారు నిజలింగప్ప తలలో మెదలడమేమిటీ, అతని నాలుకపై నగూడా నాట్యమాడేశాడు. అతని డమరుకకు మళ్ళీ ప్రాణం వచ్చింది...

''అంబ బలుకు జగదంబా బలుకు...
ఉన్నమాట ఉన్నట్లే చెబుతా
పొల్లు మాటనే బలకను తల్లీ!
కష్టాలన్నీ గట్టెక్కునులే,
మంచిరోజులూ ముందున్నవిలే,
మనసులో కోరిక తీరేకాలం
దగ్గరలోనే ఉండేయమ్మా!...
నాయుడుగారీ దయవున్నదిలే
నువ్ ......''

అంతే! నవనీతం ముఖం హఠాత్తుగా వెలవెలబోయింది. ఆమె కోపోద్వేగంతో ముక్కు పుటా లెగరవేస్తూ, ''ముయ్యి నోరు! దవడ ఊడిపోతుంది! గడుగ్గాయ్ వెధవా!'' అంటూ కొంగు నడుముకేసి చుట్టింది.

నిజలింగప్ప ముఖం వివర్ణమై పోయింది. ''అయ్యో నా రాత! నేను ముందే జెప్పానుగదే తల్లీ! నన్ను కది

లించావు. ఉన్నమాటంటే యీ ఊళ్ళో విరోధం!...ఇది తెలిసిఉండీ, నోరు విప్పాను. నాదే తప్పు..." అంటూ అతడు లెంపలు వేసుకున్నాడు.

"ఉన్నమాటయితే మాత్రం-అనదగిందీ, అనరానిదీ అంటూ___లేదూ?...పోగరుమోతా!" అంటూ అందమైన కోపంతో, భయంతో, తత్తరపాటుతో ముందుకు సాగిపో యింది నవనీతమ్మ.

...పాపం! నిజలింగప్ప! ఒక్క-సుగుణవరమే అయితే ఫరవాలేదు. దేశమంతా అంతే అయితే నిజలింగప్పవంటి నిజాయితీపరుడు ప్రాణాలతో మనగలడా?

★★